# అక్క

"ఇంకా టాయిలెట్ పూర్తికాలేదూ? ట్రెయిన్ టైముకొస్తుందట పావుగంటేవుంది" అంటున్నారు క్రిందనుంచి నాన్న.

"వచ్చేస్తున్నా" అన్నాను మేడమెట్లు దిగుతూ.

అక్క వచ్చేస్తుందంటే ఇల్లంతా సంబరంగావుంది.

నాన్న పోర్టికోలో కారుతలుపు పట్టుకు నాకోసం ఎదురు చూస్తున్నారు. అమ్మ మెట్లమీద నిల్చునివుంది. ఈ మూడేళ్ళలో అక్క జీవితం ఒకదారినపడి వుంటుంది. కాని అక్క మనసు? మూడేళ్ళయింది అక్కని చూసి.

"ఊ-ఎక్కు" అన్నారు నాన్న.

అమ్మకీ, నాన్నకీ ఎంతహాయి! బరువుదించిన తృప్తి. అక్క సంసారం ఇలా నిశ్చింతగా గడుస్తుందని వాళ్ళు అనుకోలేకపోయారు. కాపరానికి పంపిన ఏడాదిదాకా, ఏనాడు అక్క తిరిగి వచ్చేస్తుందోఅని అమ్మా వాళ్లూ వులికి వులికి పడేవారు.

అక్క గమ్మత్తయిన మనిషి. అక్కకి సంబంధించిన ప్రతి విషయం నాకు తెలుసు ననుకునేదాన్ని. కాని...జోగారావు వ్యవహారంతో అక్కని నేనెంతవరకు అర్థంచేసుకున్నానా అన్న సందేహం మొట్టమొదటిసారి కలిగింది.

అక్క కాలేజీలో-నేను హైస్కూల్లో చదువుతున్నా మాయిద్దరి మధ్యా రహస్యాలు ఉండేవికావు. అక్క నెమ్మదికీ-నా హడావుడికీ సరిపోయేది. పెళ్ళిచూపులకి బావ వచ్చేదాకా అక్క జోగారావు విషయం నాతోకూడా అనలేదు.

జోగారావు అక్క క్లాస్‌మేటని విన్నానేకాని, అక్క అతన్ని గురించి వుత్సాహంగాకూడా మాట్లాడినట్టు జ్ఞాపకంలేదు. అత్తకూతురు సుశీమటుకు అతను ముంగిలా వుంటాడని ఎద్దేవా చేసేది.

అంతటిది బావావాళ్లు పెళ్లి చూపులకి వచ్చినప్పుడు అక్క జోగారావును తప్ప మరొకణ్ణి పెండ్లాడనని, నాన్న ముఖంమీద అనేటప్పటికి ఆయన అగ్గిరాముడయిపోయారు

ఆనాడు మేడమీద మాతర్జన భర్జన, అమ్మ ఏడుపు, నాన్న మర్యాద కాపాడమని అక్కని నేను బ్రతిమిలాడడం-పెళ్ళిమాట దేవుడెరుగును, పెళ్లివారికి మొహం అయినా చూపించి నాన్న పరువు దక్కించమని నేను బతిమిలాడటం...

అక్క పెళ్లివారికి నచ్చకపోవడం ఏమిటి? ముహూర్తం పెట్టించమని నాన్నతో అన్నారు. అక్క పెళ్లికి ససేమిరా వొప్పుకోనంది. వారం రోజులు ఇంట్లో వుపవాసాలు, ఇల్లు నరకమైపోయింది.

ఆ రాత్రి అక్క గదిలో కూచుని ఆమెను నెమ్మదిగా మాటల్లో దింపాను

"ఎవరే-ఆ జోగారావు?" అని అడిగాను!

"హృదయంవున్న మనిషి"

"ఈ పెండ్లికొడుకు ఫారిన్ వెళ్ళొట్ట. డార్జిలింగులో పనిట. తనకంటే పెద్ద ఆఫీసరని మురుస్తున్నారు"

"నాన్న మురుస్తున్నారని చేసుకోమన్నావా?"

"అదిగాదు-ఆ జోగారావులో..." ఏమనగలను జోగారావుని?

మరోవారం గడిచిన తర్వాత అక్క టఫీమని సంబంధానికి వప్పుకుంది. జోగారావుకి మా కుటుంబ గౌరవం చెరపడం ఇష్టంలేదట-అని అక్క చెప్పిన మాటలు అక్క విధికి తలవంచి బుద్ధిమంతురాలనిపించుకుంది.

పెళ్లి మరుసటి నెలలో వైభవంగా జరిగింది. బావ ఫారెస్టు ఆఫీసరు. నెలకి ఎనిమిదివందలు జీతం. దూరాభారం అన్న మాటేగాని ఎంత దర్జా! అమ్మ-నాన్న వారించినా వినకుండా, పెళ్ళికి వొడిబడిన మర్నాటినుంచీ, అక్క కాలేజీ మానేసింది ఆనాటినుంచీ అక్క ముఖంలో చిరునవ్వు మాయమయింది, ఒక విధమయిన తీక్షణత బయలుదేరింది ముఖంలో.

నిన్న సాయంత్రం సుశీలతో అక్క వస్తోంది, అనగానే "మీ బావ కూడానా" అంది ఆత్రంగా, దానికెందుకో బావనుగురించి, బావ దాన్ని పెళ్ళాడక-మా అక్కని చేసుకున్నాడని ఎందుకో అంత ఉక్రోషం! అత్తా వాళ్ళందరికీ అదే ఏడుపు. పెళ్ళి సంబంధం బెడిసిపోవాలని అక్క ఎంత కోరుకుందో వాళ్ళకేం తెలుసు?

ప్లాట్‌ఫారమ్ హడావుడిగావుంది. రైలు కూతకూసి పొగలు కక్కుకుంటూ వస్తోంది. అక్క మా ముఖం ఫస్టుక్లాస్ కంపార్టుమెంటులోంచి తొంగి చూస్తోంది. అదేమిటి? అలావుందేం? ఆ కళ్ళు అంత విచారంగా ఉన్నాయి. ఎంతయినా అంత ప్రయాణబడలికా?

అక్క ముఖంలోకి మరోసారి చూడంగానే రహస్యం తెలిసినట్టయింది అక్క యీ మూడేళ్ళనుంచీ బావని వదలలేక కాదన్నమాట ఇక్కడికి రాకపోవడం. స్మృతులనుంచి పారిపోవడానికి మనుషులెంత గట్టిగా ప్రయత్నిస్తారు! అమ్మా నాన్న పెళ్ళయితే చేశారుగాని దాని హృదయాన్ని మార్చలేకపోయారు.

అక్క రైలు దిగింది. బావ నవ్వుతూ పలకరించారు. అక్క నాన్న చేతిని తన చేతిలోకి తీసుకుని నొక్కింది. అలా నొక్కడంలో ఎన్నో సందేశాలు తెలియజెప్పింది. అక్కా అందరిలాంటి మనిషే! ఆమెదీ గాయపడిన హృదయమే.

ఇంటికొచ్చిం తర్వాత అక్క తన పూర్వపుగదిలోకి వెళ్ళి నిట్టూర్పు విడుస్తూ, దూరానఉన్న కొబ్బరిచెట్లనీ, సముద్రపు అలలనీ చూసింది. గబుక్కున నావైపు తిరిగి "అతనిగురించి ఖబుర్లేవేనా తెలిశాయా?" అంది.

"బి. ఎ. అయిం తరువాత యీ వూరునుంచి వెళ్ళిపోయాడు. కొలంబోలో పనిట. సుశి అంటే విన్నాను"

"అల్లాగా" అంది నీరసంగా.

"నేనెప్పుడూ అతనితో మాట్లాడలేదు" అన్నాను ఏమీ తోచక.

"నాకు తెలుసు" అంది అక్క లోతుల్లోంచి.

అక్కని దగ్గిరగా తీసుకుని ఓదార్చాలనీ అర్థం చేసుకున్నానని ఏవేవో మాటలు చెప్పాలనీ నా స్త్రీ హృదయం పెనగులాడింది. కాని హృదయాన్ని మాటల్లోకి మార్చడమే సంభవమయితే...

మర్నాడు సుశీ, అత్తా వచ్చారు. సుశి యిదీఅదీ మాట్లాడి బావతో నవ్వింది. అక్కని హాస్యాలాడింది, వెళ్ళబోతూ "జోగారావు పెళ్ళయింది" అంది అక్కతో. ఎవరూ అడగలేదు సుశిని ఆ సంగతి. నాకు లాగిలెంపకాయ కొట్టాలనిపించింది. కాని అక్క కళ్ళు నన్ను ఆపాయి. సుశి ప్రపంచంలోని మాటలకు విలువలేదు. అవి వొట్టి గాలిమాటలు, రుచీ, సందర్భం లేనివి ఆమె మాటలు.

అక్క రెండు నెలలు ఉండాలని వచ్చింది. బావ నాల్గ్రోజుల తర్వాత వెళ్ళిపోయారు.

పొద్దుట సుశి ఫోన్ చేసింది. నన్నూ అక్కనీ టీకి రమ్మని. నాకు సుశి అంటే తలనొప్పి "వెళ్ళను బాబూ" అన్నాను అమ్మతో.

"వస్తూ పోతూంటేనే బంధుత్వం" అని అమ్మ ఏమేమిటో మాట్లాడింది.

"అక్కను వెళ్ళమను" అన్నాను.

అక్క నావంక జాలిగా చూస్తూ, "వెళ్ళకపోతే నాకు గర్వం అని చెప్పుతారు. యిప్పటికేపడి ఏడుస్తున్నారు" అంది నెమ్మదిగా. ఏదో లోకం కోసమే బతుకుతున్నట్టు నిర్జీవంగా మాట్లాడింది అక్క.

మూడుగంటలవేళ వాళ్ళింటికి బయలుదేరాం. కారు పోర్టికోలో ఆగింది. మేడమీంచి నవ్వులు వినిపిస్తున్నాయి. మెట్లు ఎక్కుతున్నాం. ముందు అక్క, వెనక నేనూ.

హాల్లో గుమ్మందగ్గిర అక్క అమాంతం ఆగిపోయింది. విరుచుకుపడిపోతుందేమో ననుకున్నాను. హాల్లో ఎదురుగా కుర్చీలో జోగారావు, పక్క కుర్చీల్లో సుశీ, రాధా, అత్త, అక్కనీ జోగారావునీ గెల్చినట్టు పదేపదే చూస్తున్నారు వాళ్ళు.

అక్కని యీమురికినుంచి చెయ్యిపట్టుకు లాక్కెళ్ళిపోవాలనిపించింది నాకు. సుశీ వాళ్ళు ఎంతసిగ్గులేని మనుషులు ? అయినా జోగారావు ఎలా వచ్చాడు బుద్ధిలేక ?

అక్క తెప్పరిల్లి, నవ్వుతూ లోపలికి ప్రవేశించి సుశినీ, రాధనీ, అత్తనీ పల్కరించి, జోగారావుని కుశలప్రశ్నలడిగి, అతని పక్కనున్న కుర్చీమీద వోపికలేనట్టు కూలబడింది.

నాకుమటుకు మహాచెడ్డ వుడుకుమోత్తనంగావుంది. ఇందుకా సుశీ 'మేముగ్రాముమ్ముగ్గో' అన్నా, బలవంతంచేసి రప్పించింది? అక్కని బాధపెట్టి, యిబ్బందుల్లో యిరికిస్తే దానికేముస్తుంది? ఇది తెలిసికూడకాదు. ఒట్టినీచత్వం. జోగారావుకూడా యీ కుట్రలో భాగస్వామా? కాని అతని ముఖంచూస్తే అతనలాంటివాడిలా కనుపించడంలేదు.

అక్క మాట్లాడితే సుశీవాళ్ళు జోగారావువంకా; అతను మాట్లాడితే అక్కవంక పరిశీలనగాచూసి తమలోతాము కళ్ళతో మాట్లాడుకునేవారు. అక్క చాలా గంభీరంగా నవ్వుతూ మాట్లాడింది. జోగారావు కాస్త తత్తరపడ్డాడు. సంభాషణ అతికష్టంగా సాగుతోంది.

పావుగంట అయింది సుశీ, రాధా టీ తీసుకొస్తామని కింద కెళ్ళారు. నేను మాట్లాడితే తిట్టేటట్టు వున్నారు. అంచేత పెదవులు బిగించుకుని కూచున్నాను.

అత్తవాళ్ళ యిద్దరివంక చూస్తూ "యిప్పుడేవస్తా" అంటు లేవబోయింది. అక్క గబుక్కున ఆవిడచెయ్యి పట్టుకుని "నువ్వు వెళ్ళకు అత్తా మా చెల్లిది మంచి సాక్ష్యంగాదు. అది నాపక్షమే పల్కుతుంది" అంది.

"ఏమిటే" అంది అత్త.

"ఏమిటేమిటి? సుశీ అతన్నీ నన్నూ సమావేశపర్చారా? తరవాత పర్యవసానమేమిటో చూడరూ? నువ్వు కాపలాలేకపోతే మేము ఒకప్పుడు ప్రేమించుకున్న వాళ్ళంకదా-అంచేత రెక్కలుకట్టుకు యీ కిటికీలోంచి ఎగిరిపోవచ్చు. అప్పుడునువ్వు ఒకరికి కాదు, యిద్దరికి సమాధానం చెప్పాలి. అందులో మా ఆయన అటవీశాఖోద్యోగి" అంటూ అత్త చెయ్యివదలకుండా పట్టుకుంది అక్క. నాకు బలేసంతోషమయింది.

"మీ ఆవిడ ఎక్కడుంది జోగారావు?" అని అడిగింది అక్క చెయ్యివదలకుండానే.

"మా ఆవిడా? నాకు పెళ్ళికాలేదే!" అన్నాడు తెల్లపోయి.

"అల్లాగా సుశీ అయిందనిఅంటే అయిందేమో అనుకున్నాను. భార్యని చూడటానికి వచ్చేవని చెప్పిందే!"

"అబ్బే, మానాన్న పోయారు. అందుకు వచ్చాను ఈవూరు. రేపు వెళ్ళిపోతాను" అన్నాడు కాలివేళ్ళు చూసుకుంటూ.

"ఐ యామ్ సారీ" అంది అక్క.

నాకు అతన్ని చూస్తే జాలేసింది.

జోగారావు అక్క మొహంలోకి చూస్తూ "ఒక్క మాట. చెప్తాను నమ్ముతావా? నువ్వు యీ వూళ్ళో వున్నట్టుకూడా నాకు తెలియదు. సుశీల టీకి పిలిస్తే వచ్చాను. కాని నాకు వీరి టీ వద్దు, ఏమీ వద్దు. నేను వెళ్ళిపోతున్నాను. ఇంకోసారి ఎప్పుడైనా ఇంతకంటె సవ్యమైన పరిస్థితుల్లో కలుసుకుందాం. ఈ కపటనాటకంలో నేను పాత్రధారిని కానని నువ్వు తెలుసుకుంటే నాకదే పదివేలు" అంటూ, అంతవరకూ బెరుకు బెరుకుగా కూచున్న జోగారావు కుర్చీలోంచి లేచి రివ్వున వెళ్ళిపోయాడు.

అత్త ముఖం కందగడ్డలా అయింది. మెట్ల దిగువని రాధా, సుశీ గుసగుస లాడుతున్నారు. ఇంకా టీ ఏమిటి? అక్కా నేను ఇంటికొచ్చేశాము. అక్కని పల్కరిస్తే హిమాలయాలు కరుగుతాయేమోనని అనిపించింది.

కిమ్మనకుండా అక్క సరాసరి తన గదిలోకి వెళ్ళి పడుకుంది. అంత తొందరగా వచ్చినందుకు అమ్మ ఆశ్చర్యపోయింది. అక్కకి తలనొప్పిగా వుందనీ, పల్కరించ వద్దనీ అందర్నీ బ్రతిమిలాడాను.

రాత్రి భోజనానికి పిల్చేందుకు గది దగ్గిరకు వెళ్ళానుగాని, తలుపు కొట్టే ధైర్యం లేకపోయింది.

అంతా పడుకున్నారు. పదకొండు అయింది. ఇల్లంతా నిశ్శబ్దంగా వుంది. నెమ్మదిగా తలుపు తట్టాను. లోపల గడియ లేదు. తలుపు తెరుచుకుంది. చీకట్లో పక్కమీద అక్క పడుకుని వుంది. ఆ చీకటిగదిని ఆమె కాటుకకళ్ళు వెలిగిస్తున్నాయి.

అక్కని రెండు చేతుల్లోకి తీసుకుని, "అవమానాలు భరించాలి. మనం ఆడవాళ్ళం. భూదేవిలాంటి వాళ్ళం" అన్నాను తలనిమురుతూ.

నా వడిలోకి మహా ప్రవాహాలు పరుగెట్టాయి.